# జడల సదాశివుడు

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

“జడల సదాశివుడుగారిల్లు ఇదేనా?” అని అడిగాడు ఒక సంసారి, వారి యింటి ముంగిలికే వచ్చి. “ఇదే! కూర్చోండి, వస్తారు” అని, ఆయన భార్య లోనికివెళ్ళిపోయింది. రాజయ్య నిరీక్షిస్తున్నాడు.

సదాశివుడి ఇంటిపేరు వేమూరివారు. గొప్ప అనుష్ఠాత. ప్రక్కనే వున్న పుల్లేటిలో స్నానం చేసి, జపానికి కూర్చుంటే, మధ్యాహ్నం పన్నెండు గంటలకు, పీటమీద నుండి లేవడం, భోజనం చేయడం, అపర సంధ్యా సమయందాకా గ్రంథావలోకనం చేయడం, తిరిగి రాత్రి తొమ్మిది గంటలదాకా జపం చేయడం, ఆయనకు పరిపాటి.

తైల సంస్కారం లేక జుట్టు జడలు కట్టిపోవడం చేత, ఆయనను జడల సదాశివుడని ఉయ్యూరులో పిలుస్తారు. ఒకసారి అనావృష్టి సంభవిస్తే, ఆయన ఆధ్వర్యంలో జపాలు జరిగితే, వర్షం కురవడంతో ఆయన కీర్తి చుట్టుపట్ల గ్రామాలకు కూడా వ్యాపించింది.

విభూతి రేఖలతో కొట్టవచ్చినట్టు కన్పించే పెద్ద కుంకుమ బొట్టుతో, కంఠం చుట్టూ రుద్రాక్ష మాలలతో, జటలను బిగించిన రుద్రాక్ష వలయంతో, సాక్షాత్తు పరమశివుడల్లే వచ్చి కూర్చున్నాడు సదాశివుడు. రాజయ్య నమస్కరిస్తే, ‘శార్వణం’ అంటూ అతనివంక, ఎగాదిగా చూశాడు. “మీ ఊరు?” అన్నాడు. “కనుమూరు - మా ఊరికీ, మీ ఊరికీ మధ్య మంటాడే అడ్డం! తమతో అగత్యమైన పనిమీద వచ్చాను.” “కూర్చుని చెప్పండి! దేహం వంకకు చూశారుగా! బొల్లి! దీనినే వైద్యులు శ్వేత కుష్ఠం అనీ, శ్విత్రం అనీ, చెప్పి చాలాకాలం మందిచ్చారు. మందు పనిచేసినట్లే పనిచేస్తుంది కాని, మళ్ళీ వ్యాధి మామూలవడం మామూలయిపోయింది. కొడుకులే కాక కట్టుకున్న పెళ్ళాం కూడా అసహ్యించుకునే స్థితికి వచ్చాను. తమవల్ల కాని, ఇది నయం కాదని తమ దర్శనానికి వచ్చాను.”

“నేనేమీ వైద్యుణ్ణి కాదే!” అన్నాడు సదాశివుడు. “తమరు సాక్షాత్తు శివస్వరూపులు. తమరు తలచుకుంటే, మంత్రంతో నయంచేయగలరు. తమరు కాదంటే ఇంటికి కూడా వెళ్ళకుండా, ఈ పుల్లేట్లోనే పడి చస్తాను” అని, వెక్కివెక్కి ఏడ్చాడు రాజయ్య. “నేను సాధకుణ్ణే గాని, శివుణ్ణి కాదు. ఆత్మ హత్య పాపం. పూర్వజన్మలో చేసిన పాపాలవల్ల వ్యాధులు సంభవిస్తాయి. దారుణమైన పాపాలకు ఈ రోగాలు చిహ్నాలు. ఔషధ సేవతోపాటు, గ్రహ శాంతులు కూడా వ్యాధులకు అవసరం. ప్రారబ్ధకర్మ వల్లనే ఈ వ్యాధి వస్తే, అనుభవించవలసినదే కాని, ఏ తపశ్శాలీ ఏమీ చేయలేడు.”

“ప్రారబ్ధం అంటే ఏమిటి?”

“ఈ జన్మలోనే అనుభవించడానికి పరమేశ్వరుడు విడిగా తీసిపెట్టిన కర్మ. అతడు కర్మఫల ప్రదాతకద ప్రారబ్ధం ఎక్కుపెట్టబడిన బాణం వంటిది. దాని తప్పించుకోవడం సాధ్యం కాదు. సుఖ ప్రారబ్ధంఅయితే మహారాజ యోగం పట్టుతుంది. దుఃఖ ప్రారబ్ధ అయితే, ఇట్లాంటి అనుభవాలు కలుగుతవి. అయితే ఏ ప్రారబ్ధమో నిర్ణయించడం కష్టం. అందుచేత, పా క్షయం కోసం, మానవ ప్రయత్నం చేయాలి.”

“స్వామీ! నాకు నన్ను కట్టుకుపోయేటంత ఆ వున్నది. వ్యాధి నివారణ నిమిత్తం ఎంత సొమ్మయి వెచ్చిస్తాను. నాకు ఉపయోగపడని ద్రవ్యం వల్ల నాకే ప్రయోజనం? ఇల్లా జీవించి ఏమి ప్రయోజనం? త కృషి తాము చేయండి. తాము చెప్పినట్లుగా నే వినుకుంటాను. మీ పాదాలు సాక్షి. ఏది ప్రారబ్ధమో తెలుసుకోవడం కష్టమని, తమరే సెలవిచ్చారు క కనుక దీనిని ప్రారబ్ధ కర్మ కని ఎందుకనుకోవా ఈశ్వరారాధన చేస్తే, నయమవుతుందేమో! మా ప్రయత్నం అవసరమని అన్నారు కదా— అది ద్వారానే చేస్తాను. తమరు ప్రకృతితోనే పోరాడి, వర్ష



కురిపించినవారు కదా!'' అన్నాడు రాజయ్య.

''నీవు చెప్పింది సబబుగానే ఉన్నది, కాని—''
''ఆగిపోతారేం చెప్పండి'' ''అది సర్వ ప్రజోపకారం కోసం జరిగిన పని. వర్షం నిమిత్తం, జమీందారు కనుక అంత ఖర్చు పెట్టగలిగాడు. ఏదో ఒక ఆదుర్దాలో వచ్చి, ఖర్చు పెడతానంటున్నావు కాని, నీవు చివరిదాకా నిలబడగలవా! అనే సందేహం నాకున్నది. అదీకాక— ఏది ప్రారబ్ధమో, ఏది కాదో తెలిసికొనలేని, వట్టి తడుమళ్లాట మనది! తీరా, ఇది ప్రారబ్ధమే అయి, ఫలితం కనబడకపోతే, నీవు పెట్టిన ద్రవ్యం అంతా వ్యర్థమని నీవే విచారిస్తావు.''

''విచారించను. మా నాయనమ్మ నాకు బంగారు కణికెల ఫ్లాతర ఇచ్చిపోయింది'' అన్నాడు రాజయ్య. సదాశివుడికతని మీద నమ్మకం పూర్తిగా కుదరకపోయినా, అతని దీన స్థితిని చూసి, జాలిపడ్డాడు.

''అయితే చెబుతా విను! ఈ గ్రామంలోనే విడిగా ఒక యిల్లు అద్దెకు తీసుకోవాలి. మా ఆవిడ సుస్తీ మనిషి. బహుళ జనానికి వంట చేసిపెట్టలేదు. అందుచేత ఒక యోగ్యురాలైన వంట మనిషిని ఏర్పాటు చేయాలి. ఆమె కార్యక్రమంలో వున్న ఋత్విక్కులకే వంట చేసి పెడుతుంది. ఆమె ఖర్చును భరించవలసి వుంటుంది.''
''సరే!'' ''ఇక మండలం రోజులు— అంటే నలభై రోజులు పన్నెండుగురు సౌర జపం, పన్నెండుగురు అరుణ పారాయణం, పన్నెండుగురు సూర్య నమస్కారాలు, పదకొండుగురు రుద్రాభిషేకం చేయవలసి వుంటుంది. రాత్రిళ్లు కూడా నియమంగా వారక్కడే పడుకుంటారు. ఇంకొక చోటికి, మధ్యలో ఎవరైనా పిలచినా వెళ్లరు. వారందరికీ భోజనం ఖర్చూ, దక్షిణ ఖర్చూ భరించాలి. వంట మనిషికీ, ఋత్విక్కుల దక్షిణా ఏ రోజుది ఆ రోజే ఇచ్చివేయాలి.


ప్రతి మూడురోజులకు ముందుగా కావలసిన బియ్యం, పప్పు, కూరలు, వంట కట్టెలు, నేయి వగైరా అక్కడ సిద్ధంగా వుంచాలి. గీపారాధనకు ఆవునేయి కావాలి. రోజూ పెరుగూ, పరమాన్నానికి పాలు కావాలి. ఇల్లా చివరిదాకా నెగ్గితే, తర్వాత సమారాధన. సూర్య ప్రీతిగా ఇవి చేయాలి. ''ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్'' అని కదా! ''విత్త శాఠ్యం నకారయేత్'' ద్రవ్యలోపం చేయకూడదు. అగ్నిహోత్రుడు నెయ్యి ఎంత కుక్షిలో పోస్తే, అంత మండుతాడు–అనుగ్రహిస్తాడు. బ్రాహ్మడు శపిస్తాడు. అందుచేత విప్రప్రీతి ముఖ్యం. బ్రాహ్మణులకు ఘృతల ముఖ్యం అన్నాడు సదాశివుడు. ఇంతేకదా? అన్నాడు రాజయ్య.


''నీవు ఆపదలో వున్నవాడవు కనుక, ఇప్పుడు ఇంతేకదా— అని అంటున్నావు. ఇందులో ద్రవ్యం ఖర్చుపెట్టడం ఒక ఎత్తు— శ్రద్ధాభక్తులు లోపిస్తే జపాలు మధ్యలోనే ఆగిపోవచ్చు! నీవు నాకేమీ యీయ నక్కరలేదు. నా యింటి దగ్గరనే నేను అనుష్ఠానం చేసుకొని, ఆ తర్వాత ఆ ప్రదేశానికి వచ్చి, నీ మేలుకోసం, కొద్దిసేపు జపం చేసి, ఆ దేవతా సాన్నిధ్యంలోనే భోజనం చేస్తాను.'' ''నాకు ఇంతగా చెప్పాలి టండీ!'' అన్నాడు రాజయ్య.

* * * *

కార్యక్రమం ప్రారంభమయింది.

అర్థమండలం రోజులు దాటిన దగ్గర నుండీ బొల్లి,



క్రమంగా ఆరోజుకారోజు ఆశ్చర్యంగా తగ్గడం ప్రారంభించి, మరి అయిదురోజులకు రూపాయి పరిమాణానికి వచ్చింది. ఆపైన వేగంగా తగ్గడం మానివేసి మొరాయిస్తున్నట్టుగా, నూలువాసి మాత్రమే తగ్గింది ఆశ్చర్యం. ముప్పై రోజులయ్యేటప్పటికి అర్ధ రూపాయి పరిమాణానికి రావడమే కష్టమయింది. అసలు జపాలకు జవాబు వస్తోంది కదా అని, సదాశివుడు సంతోషిస్తూ వుంటే రాజయ్య మాత్రం వేగిరం తగ్గడం లేదని, సహనం కోల్పోతున్నాడు. నెల రోజులయినదగ్గర నుండి, బ్రాహ్మణులకు, ఆ రోజుకారోజు చేతిమీద వేసుకొనే నేయి తగ్గడం ప్రారంభించింది. ఎందుకు శ్విత్రం త్వరగా తగ్గడం లేదా— అని, సదాశివుడు ఆలోచిస్తూ వుండగా, ఒకరోజున బ్రాహ్మణుల చేతిమీద నేయి, బాగా తగ్గి వడ్డించడం గమనించడం జరిగింది. "ఏమమ్మా! నెయ్యి జాగ్రత్తగా వాడుతున్నట్లున్నావు. ఇదివరకు వాడినట్లువాడడం లేదు. కథ ఏమిటి?" అన్నాడు సదాశివుడు వంటలక్కతో. వంటలక్క పెదవి బిగబట్టుకుంది కాని, మాట్లాడలేదు.

సదాశివుడు మరురోజూ గమనించాడు. "ఏమమ్మా! నిన్న నేను చెప్పినా, ఇవాళ కూడా అల్లాగే వడ్డిస్తున్నావు" అన్నాడు. ఆమె మాటలాడలేదు. మిగిలిన బ్రాహ్మణులు ఒకరి ముఖం ఒకరు చూసుకొని, చిరునవ్వు నవ్వుకుంటున్నారు. దానినీ సదాశివుడు గమనించాడు.

"నువ్వు ఏమయినా మిగుల్చుకుంటున్నావా?" అని, గద్దించాడు.

"శివ శివా! నేను అట్లాంటి దానిని కాదండీ! బ్రాహ్మణుల నోటిముందు ద్రవ్యం అపహరించడం మహా పాతిత్యం. నేను వున్న సరుకును బట్టి వేస్తున్నాను. కొంతకాలం నుండీ ఆయన తగ్గించే ఇస్తున్నాడు. నేను ఎల్లాగో అల్లా సరిపుచ్చుతున్నాను. నిన్న మీరు ప్రస్తావించారు కనుక, ఇవాళ ప్రొద్దున రాజయ్యగారితో ఆ విషయం చెప్పాను. ఆయన నసిగాడు.

ఇదివరలో వేగంగా తగ్గినదనీ, ఇప్పుడు నూలువాసి మాత్రమే తగ్గుతోందనీ, ఇల్లా తగ్గితే ఎన్నాళ్లు పదుతుందో అనీ, ఈ ఖర్చు భరించడం కష్టంగా వున్నదనీ అన్నాడు. అదీకాక, ఇదివరలో బ్రాహ్మణులుసక్రమంగా జపాలు చేశారు కనుక తగ్గినదనీ, ఇప్పుడు కాలక్షేపం చేస్తున్నారు కాని, సరిగా చేస్తే తగ్గదా? అని కూడా అన్నాడు."

బ్రాహ్మణులు తెల్లబోయారు. "మాలో మార్పు ఏమీ లేదు. తగ్గుతోంది కనుక, ఆ మనిషిలోనే మార్పు వచ్చి వుండాలి" అన్నాడు అందులో ఒకడు. సదాశివుడు మాట్లాడలేదు.

వంటలక్క కూడా భోజనం చేసిన తర్వాత "ఇవాళతో ఈ కార్యక్రమానికి స్వస్తి" అని, చెప్పేశాడు అందరితో ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. ఇంటికి తాళం!

** ** **

పూజా మందిరానిక తాళం పెట్టబడి వుండడం చూసి, కనుమూరు నుండి వచ్చిన రాజయ్య, సదాశివుడి ఇంటికి వెళ్లాడు. "ఈ రోజున పూజలు లేవా అండి?" అని అడిగాడు. "నిన్నటితో స్వస్తి చెప్పాను. ఇదిగో తాళం చెవ్వి! మిగిలిన పదార్థాలు నీవు తీసుకొని వెళ్లిపోవచ్చును" అన్నాడు. "అదేమిటి?"వంటలక్కతో రాజయ్య ప్రసంగంగా, వంటలక్క చెప్పిన మాటలన్నీ చెప్పి ఇవీ నిజమేనా? అని అడిగాడు సదాశివుడు.

రాజయ్య తల వంచుకున్నాడు.

"మనం అనుకున్న పద్ధతిగా నీవు వుండలేదు. మాయందు నీకు శ్రద్ధాభక్తులు తక్కువయినవి కనుక. నీయందు మాకాదరం వుండవలసిన అవసరం లేదు' అన్నాడు సదాశివుడు.

రాజయ్య ఖిన్నుడయినాడు. "ఇంకా ఎన్ని నెలలు పదుతుందో అని భయపడ్డాను" అన్నాడు.

"ఇప్పుడా భయం తీరిపోయినది కదా!"

"సరేలెండి! ఇంతవరకు నయమయినది కదా! ఎక్కడో, లో తొడలలో, ఆ మాత్రం మచ్చవుంటే, పోయిందేముంది లెండి"! అని, తాళం చెవ్వి తీసుకొని వెళ్ళిపోయినాడు. సదాశివుడు నిట్టూర్చాడు

*   *   *   *

మరురోజు నుంచే, అర్ధ రూపాయి పరిమాణం గల మచ్చ, రూపాయి అంత అయింది. శరవేగంతో పెరగడం ప్రారంభించి, రెండు మండలాల కాలంలో మామూలు వ్యాధి వచ్చేసింది.

అదే రూపంతో రాజయ్య వచ్చి సదాశివుడి వాకిట్లో నిలబడ్డాడు. సదాశివుడు కూర్చోమన్నాడు.

"మళ్లీ మామూలయినట్లుందే!" అన్నాడు జాలిగా.

"అయింది. అందుకే వచ్చాను— తిరిగి, పూజలు ప్రారంభం చేస్తారేమోనని!" అన్నాడు రాజయ్య.

"నాయనా! ఆదినుంచీ నీ వ్యాధి విషయం, నాకనుమానంగానే వుంది, నయమయే విషయంలో. అది ప్రారబ్ధమో, కాదో తెలియదు కనుక కృషి ప్రారంభించాము. నీయందు నాకు అనురాగమే వుంది కాని ద్వేషం లేదు. నీ సంకల్పానికి వికల్పం కలిగింది. "బుద్ధిః కర్మాను సారిణీ!" అన్నట్లు నీకు కక్కుర్తి కలగడం, నీ ప్రారబ్ధం వల్లనే. మంత్రంలో శక్తి వున్నదని రుజువయింది. నీ ప్రారబ్ధాన్ని అది జయించలేదు కదా!"

"తిరిగి ప్రారంభించండి! ఈ పర్యాయం నిక్కచ్చిగా వుంటాను"

"నాయనా! అప్పుడు ఖర్చుపెట్టుకోలేని వాడవు, ఇప్పుడెల్లా ఖర్చుపెట్టుకుంటావు? కేవలం ద్రవ్యం వల్లనే అన్ని పనులూ కావు. శ్రద్ధాభక్తులు వాని వెనుకవుండాలి. నేను స్వస్తిచెప్పిన దేవతను తిరిగి ఎల్లా పిలుస్తాను? అది నా చేతిలో ఆటవస్తువు కాదు. నేను ఏ ఒక్క వ్యక్తికీ నా శక్తిని ధారపోయలేదు. నీకు పోద్దామనుకున్నాను., జాలిచేత. ఫలించినట్లే ఫలించి, విపరీత ఫలితాన్ని ఇచ్చింది. విధి బలీయం! ప్రారబ్ధం అంటే అదే! నీ వ్యాధి పుడకలతో కాని పోదు. నిజం చెప్పానని బాధపడవద్దు. 'ప్రారబ్ధం భోగతో నశ్యతి' అన్నాడు సధాశివుడు. రెండు కన్నీటి బొట్లు రాలుస్తూ.



## ప్రగతిశీలి హేలి

ఈ భూమి పంచకు
గమనించి
జోహారు లర్పించు జగతి—
నడిరేయి నేనతని
నగుమోము చూచితి
త్యాగరాయని తంత్రి
రాగమైపోయితి
మరల అతనిని కందునో
ఐన
అది ఏ లోక మందునో!!
ఎప్పుడో ఒకసారి
అతిథిగా వచ్చిపోతాడు
హేలి

అంతరిక్షపు బాటసారి—
చుక్కల్లో చుక్కయై
సూర్యునికి చుట్టమై
ఆకాశ వనవీధి
ఓ కపీశ్వరుని వలె
దక్కగా వస్తాడు హేలీ
తోకచుక్క అనిపిస్తాడు హేలీ—
భూలోక మెల్ల పర్యాలోకనము చేసి
చిత్రమౌ విజ్ఞాన చిత్రపటములు గీసి
కలవోలె కరగిపోతాడు — హేలి
నిజముగా మెరసిపోతాడు —
ఈ విశ్వవిద్యాలయ
ప్రయోగశాలో-పరిశోధనలు
చేయు శాస్త్రజ్ఞుడోయన
హేలి సాధించెడు ప్రగతి

—జె. బాపురెడ్డి